ప్రజాశక్తి

ఆదివారం 15 అక్టోబర్ 2023

5

పార్వతీపురం మన్యం

20న మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఇంటర్మీడియేట్, డిప్లొమా, డిగ్రీ చదువిని యువతీ, యువకులకు ఈ నెల 20న స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో మినీ జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు 18 నిండి 25 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎంఎస్ఎన్ లాబొరేటరీస్, ఆనంద్ ఆటోమోటివ్ లిమిటెడ్ ప్రతినిధులు ఈ జాబ్ మేళా ఎంపికలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు తమ వివరాలను ఝఝఝ.ఖజూంంఎఎ.ఱఅ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలు కోసం 6305110947, 6303493720ను సంప్రదించాలని కోరారు.

విఏఎల మెడపై 'యాప్'ల కత్తి

సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులపై తీవ్ర పని ఒత్తిడి కనిపిస్తోంది. గ్రామాల్లో రైతులు పండిస్తున్న పంటలు, విత్తనాలు, ఎరువుల కొనుగోలు, అమ్మకాలు, కోత సమయంలో దిగుబడి, ఒకవేళ నష్టం వాటిల్లితే కారణాలు వంటి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధించిన యాప్‌ల ద్వారా గ్రామ వ్యవసాయ సహాయకులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక ఏడాదిలో వ్యవసాయ శాఖకు సంబంధించి వివిధ రకాల యాప్‌ల ద్వారా వారు సమాచారాన్ని అప్ లోడ్ చేయాల్సిన అవసరం ఉంది. ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో రైతులు పండించిన పంటల ఆధారంగా ఎప్పటికప్పుడు వివరాలను అప్ లోడ్ చేయాలని మండల, జిల్లా వ్యవసాయ అధికారులు ఆదేశాలిస్తారు. గ్రామాల్లో రైతు పంట పొలాల్లోకి వెళ్లి ఫొటోలతో సహా వివరాలు పొందుపరిచాల్సి ఉంటుంది. ఈ విధుల నిర్వహణలో కింద స్థాయిలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులు తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా మహిళా ఉద్యోగులు, ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను చేధించే క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా కొంతమంది మహిళా ఉద్యోగులు అనారోగ్యానికి గురవుతున్నారు. గత మూడేళ్లలో కొంతమంది మహిళా వ్యవసాయ సహాయకులు ఒత్తిడిని తట్టుకోలేక గర్భస్రావానికి గురైన పరిస్థితి ఏర్పడింది.

యాప్ విడుదలలో జాప్యం

దండిగాం జంక్షన్లో ఇ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకులు

ప్రజాశక్తి-సాలూరు

జిల్లాలో సుమారు 350 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సుమారు 200మంది వరకు మహిళా వ్యవసాయ సహాయకులు పని చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి అధికారుల నిర్ణయాలు కింద స్థాయిలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులపై తీవ్ర పని ఒత్తిడి పెంచుతున్నాయి. ఏటా ఖరీఫ్ సీజన్లో పంటలు, విత్తనాలు, ఎరువులు, రైతులకు సంబంధించిన వివరాలను సమయానుకూలంగా యాప్‌ల్లో వ్యవసాయ సహాయకులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఇ-క్రాప్ యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 18 తర్వాత విడుదల చేసింది. ఖరీఫ్‌లో రైతులు పండించిన పంటల సాగుకు సంబంధించిన ఇ క్రాప్, ఐకెవైసి యాప్‌ల్లో వివరాలు నమోదు చేయాల్సి ఉంది. ఆగష్టు 20 తర్వాత ఇ- క్రాప్ యాప్ వినియోగంలోకి వచ్చింది. జూన్ నుంచే ఖరీఫ్ సీజన్లో రైతులు వ్యవసాయ పనులు మొదలుపెడతారు. అంటే ఇ-క్రాప్ యాప్ కూడా అదే నెల నుంచి వినియోగంలోకి రావాల్సి ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా యాప్ ఆగస్టు 20 తర్వాత వినియోగంలోకి రావడంతో వ్యవసాయ సహాయకులు తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో కనీసం వెయ్యి నుంచి మూడు వేల ఎకరాల వరకు పంట భూములు ఉంటాయి. ఈ భూముల్లో సాగు విస్తీర్ణం, ఏఏ పంటలు సాగు చేస్తున్నారనే వివరాలను ఇ-క్రాప్‌లో నమోదు చేయాలి. రైతులకు సంబంధించిన పొలాల్లోకి వెళ్లి నమోదు చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరుతో ఖరీఫ్ సీజన్ ముగిసినా ఇ- క్రాప్ నమోదు కార్యక్రమాన్ని అక్టోబర్ 11 వరకు కొనసాగించారు. నాలుగు నెలల ఖరీఫ్ సీజన్లో నిదానంగా జరగాల్సిన ఈ క్రాప్ నమోదు ప్రక్రియను కేవలం రెండు నెలల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆంక్షలు విధించారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని ఏజెన్సీ ప్రాంతంలో ఇ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం వ్యవసాయ సహాయకులకు కత్తిమీద సాములా తయారైంది. సర్వర్ బిజీగా ఉన్న కారణంగా ఇంటర్నెట్ పని చేయకపోవడంతో సర్వర్ పని చేస్తున్న సమయంలోనే ఉద్యోగులు ఇ క్రాప్ నమోదు చేయాల్సి వచ్చింది. ఏజెన్సీ ప్రాంతంలో గిరిశిఖర గ్రామాలకు వెళ్లి ఇ- క్రాప్ నమోదు చేయాల్సి రావడం, నిర్దేశిత లక్ష్యాన్ని సాధించగలమో లేదోనన్న ఆందోళన మహిళా ఉద్యోగులను అనారోగ్యానికి గురి చేసింది. ఈ క్రమంలో ముగ్గురు వ్యవసాయ సహాయకులకు గర్భస్రావం అయినట్లు తెలిసింది.

సమస్యల్ని రాష్ట్ర నాయకత్వానికి చెప్పాం

కింద స్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎదుర్కొంటున్న సమస్యల్ని రాష్ట్ర నాయకత్వానికి చెప్పాం. పని ఒత్తిడి బాగా పెరిగింది. ప్రతీ పని యాప్‌ల్లో నమోదు చేయడం, ఇంటర్నెట్ సౌకర్యం లేక, సర్వర్ బిజీగా వున్న కారణాలు వల్ల సకాలంలో నిర్దేశిత లక్ష్యాన్ని చేరలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం సకాలంలో ఇ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించకపోవడంతో పని ఒత్తిడికి కొంత మంది మహిళా ఉద్యోగులు అనారోగ్యానికి గురయ్యారు.

సంతోష్,
గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం అధ్యక్షుడు,
పార్వతీపురం మన్యం జిల్లా



అటవీశాఖకు బదలాయించిన భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు, బాధితరైతులు

అటవీశాఖకు భూముల బదలాయింపు దారుణం

బాధిత రైతులకు సిపిఎం అండ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతుల పట్టా భూములను బలవంతంగా అటవీశాఖకు బదలాయించడం సమంజసం కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు విమర్శించారు. గొట్టివలస, ఉల్లిభద్ర రెవెన్యూ పరిధిలో అటవీ శాఖకు బదలాయించ తలచిన భూములను శనివారం సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ అనేక ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న రైతులకు 2008లో ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని ఆ భూములపై రైతులు విలువైన టేకు, నీలగిరి మొక్కలను నాటి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. గరుగుబిల్లి మండల రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సర్వేనెంబర్ 272,273,274లో ఉన్న రైతులను కనీసం సంప్రదించకుండా వారి భూములను అటవీ శాఖకు బదలాయించారని ఈ చర్య చట్టపరంగా తీవ్ర అభ్యంతరమని తెలిపారు. అటవీశాఖకు బదలాయించిన భూమి సర్వే నెంబర్ 279 గా అధికారుల పేర్కొని, 272, 273, 274 సర్వే నెంబర్లలో పట్టాలు పొంది సాగులో ఉన్న రైతుల భూముల నుండి తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చట్టాన్ని కాపాడాల్సిన రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం గరుగుబిల్లి మండలంలో చట్టాన్ని దిక్కరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు సమయం ఇచ్చినట్లు నమ్మబలికి రైతుల, ప్రజల ప్రమేయం లేకుండా, క్రైస్తవ భక్తులు పూజలు నిర్వహించిన పూజా సామాగ్రిని ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

దౌర్జన్యంగా ట్రెంచ్ నిర్మాణం చేస్తున్నారని, తక్షణమే ఈ పనులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతుల తరుపున ముందుండి సిపిఎం ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బివి రమణ, రైతు ప్రతినిధులు బొండపల్లి ప్రసాదరావు, బోను శంకరరావు, బోనెల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం నాడు పట్టణంలో 27వ వార్డు, రాజుగారి కోట ప్రాంతంలో ఉన్న ఎజెఆర్ కాలనీ వీధిలో కొత్తగా నిర్మించబోయే సిసి కాలువలు, రోడ్డు, పైపు లైన్ పనులకు ఆ వార్డు కౌన్సిలర్ సభ్యులు ఇందుపూరు గున్నేష్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కాలనీ గత 40 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోక పోవడంతో గడపగడపకు మన ప్రభుత్వం స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నేడు ఈ అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందని, మీకు ఎవరికీ ఏ ఇబ్బంది లేకుండా అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్ మజ్జి శేఖర్ (చంటి), బాలమురళీకృష్ణ, మండలం నాయకులు, స్థానిక పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జెసిఎల్‌తో చర్చలకు డుమ్మాకొట్టిన యజమాని

డిప్యూటీ సిఎంతో చర్చల వెనుక ఆంతర్యమేమిటో?

జ్యూట్ మిల్లు కార్మికుల్లో ఆందోళన

సాలూరు జ్యూట్‌మిల్లు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్లు కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మిల్లు యాజమాన్యం కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోందనే అభిప్రాయం కనిపిస్తోంది. 16నెలలుగా మిల్లును మూసివేయడంతో 1200 కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారు. కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వలేదు. ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన జీతభత్యాలు పంపిణీ చేయడం లేదు. దీంతో కార్మికులు గత 45రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. మిల్లు గేటు ముందే దీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ క్రమంలో కార్మిక సంఘాల జెఎసి నాయకులు డిప్యూటీ సిఎం రాజన్నదొరను కలిసి సమస్యలు వివరించారు. దీనికి స్పందిస్తూ రాష్ట్ర లేబర్ కమిషనర్, కార్మిక శాఖ మంత్రికి లేఖలు రాశారు. ఈనెల 17,18తేదీల్లో సంబంధిత శాఖ కమిషనర్, మంత్రులతో చర్చిస్తానని ఆయన చెప్పారు. అయితే ఆ మరుసటి రోజే యాజమాన్యం ప్రతినిధి సప్తగిరి డిప్యూటీ సిఎం రాజన్నదొరను విశాఖపట్నంలో కలిసి కార్మికులకు న్యాయం చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందని కార్మికులు భావిస్తున్నారు. రెండు వారాల క్రితం విశాఖలో జాయింట్ లేబర్ కమిషనర్ దగ్గర జరిగిన చర్చలకు డుమ్మా కొట్టిన యజమాని డిప్యూటీ సిఎంను కలవడం వెనుక అంతర్యమేమిటనే వాదనలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారి వద్ద జరిగిన చర్చలకు హాజరై తన వాదనను వినిపించుకోకుండా డిప్యూటీ సిఎం రాజన్నదొరతో రహస్య మంతనాలు జరపడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కార్మిక శాఖ మంత్రి, లేబర్ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పిన రాజన్నదొర మిల్లు యజమాని తో చర్చించడం వల్ల కార్మికులకు చేకూరే ప్రయోజనం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. మిల్లు యాజమాన్యంపై ఉన్నతాధికారుల ఒత్తిడి పెరగకుండా యాజమాన్య ప్రతినిధి సప్తగిరి రాజన్నదొరను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారనే ప్రచారం జరుగుతోంది. డిప్యూటీ సిఎం రాజన్నదొరకు జ్యూట్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని చిత్తశుద్ధి ఉంటే మిల్లు యాజమాన్యం, సంబంధించిన శాఖ అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో తన సమక్షంలో చర్చలు నిర్వహించి ఉంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కార్మికుల హక్కుల కోసం పనిచేస్తున్న ప్రభుత్వ చట్టాలకు లోబడి జ్యూట్ మిల్లును నడిపించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

గిరిజన బాలుడి ఆరోగ్యంపై ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఆరా!

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని పొలం గూడ గ్రామంలో పసర మందు తాగి ఇద్దరు గిరిజన చిన్నారులు చనిపోయిన సంఘటన విదితమే. ఈ సమాచారంతో ఏపి ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఆ కుటుంబంలో ఆరేళ్ల బాలుడు జ్వరంతో బాధపడుతున్న విషయాన్ని గమనించి వైద్య సహాయానికి నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించమని ఆదేశించారు. ఆ బాలుడు ఆరోగ్యం ఎలా ఉందని శనివారం నీలకంఠాపురం పిహెచ్‌సి వైద్యులకు ఫోన్లో మాట్లాడారు. బాలునికి జ్వరం తగ్గిందని నీలకంఠాపురం వైద్యులు తెలిపారు. అనంతరం బాలుడు ఆరోగ్యంపై ఎల్విన్ పేట ఎస్ఐ షణ్ముఖరావుతో కూడా మాట్లాడారు.

తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని మామిడిపల్లి సమీపానగల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వద్ద శనివారం ఆర్టీసీ బస్సును వెనుక నుంచి కారు ఢీకొట్టింది. పాఠశాల వద్ద ప్రయాణికులను దించేందుకు బస్సును ఆపగా వెనుక వస్తున్న కారు అదుపుతప్పి బస్సుని ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు ముందు భాగం దెబ్బ తిన్నది. ఇందులో ఉన్నవారెవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.కారు నుజ్జు కావడంతో నష్టం వాటిల్లింది.

బస్సు వెనుక భాగాన ఢీకొన్న కారు

నకిలీ ఇళ్ల పట్టాలపై రెవెన్యూ దూకుడు

ప్రజాశక్తి-బొబ్బిలి

నకిలీ ఇళ్ల పట్టాలపై రెవెన్యూ అధికారులు దూకుడు పెంచారు. మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలను కొంతమంది ఆక్రమించుకుని నకిలీ పట్టాలు తయారు చేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ ఇళ్ల పట్టాలపై 'ప్రజాశక్తి'లో కథనాలు రావడంతో ఆర్‌డిఒ పి.శేషశైలజ స్పందించి సమగ్ర దర్యాప్తు చేయాలని తహశీల్దార్ డోల రాజేశ్వరరావును ఆదేశించారు. దీంతో వివిఆర్ఒలతో నాలుగు బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో ఆక్రమణ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ ఆయా ప్రాంతాల్లో బోర్డులను ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయడంతో ఇకపై ఆక్రమణలను అడ్డుకోవచ్చని తహశీల్దార్ రాజేశ్వరరావు చెప్పారు. దర్యాప్తులో నకిలీ పట్టాల గుట్టు బయట పడటంతో అక్రమార్కుల్లో గుబులు మొదలైంది. నకిలీ పట్టాలను గుర్తించేందుకు, ప్రభుత్వ ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా వివరాలు ఇచ్చి సహకరించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరినట్లు తహశీల్దార్ చెప్పారు. కొత్త నిర్మించే ఇళ్ల పత్రాలు శాఖకు పంపించి ఒరిజినల్ పట్టా, కాదో నిర్ధారణ చేసుకున్న తర్వాత మాత్రమే నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

కోట దుర్గ ఆలయం

ఆదాయం ఘనం... సదుపాయాలు శూన్యం

అరకొర సౌకర్యాల నడుమ నేటి నుంచి దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక కోట దుర్గమ్మ ఆలయంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న దసరా నవరాత్రి ఉత్సవాలు అరకొర సౌకర్యాల నడుమ కొనసాగనున్నాయి. తొలిరోజు నిజరూప దర్శనానికి పాలకొండ పట్టణంతో పాటు చుట్టుపక్కల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ దసరా ఉత్సవాలు ఈసారి కూడా అరకొర సదుపాయాల మధ్య జరగనున్నాయి. క్యూ లైన్ల దగ్గర కనీస సదుపాయాలు కూడా ఏర్పాటు చేయని పరిస్థితి నెలకొంది. రేకుల షెడ్డు నిర్మించి యాత్రికులకు క్యూలైన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఎండ తీవ్రతకు ప్రతి ఏటా భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేని పరిస్థితి నెలకొంది. మరుగుదొడ్ల సదుపాయం ఉన్నా నిరుపయోగంగా ఉండడం వల్ల దూర ప్రాంతం నుంచి వచ్చే మహిళలు, చంటి పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉంది. ఏటా కోటి రూపాయలకు పైగా ఆదాయం వచ్చే ఈ దేవాలయంలో కనీస సదుపాయాలు కూడా లేకపోవడంతో అంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ ఎక్కడ?

దసరా ఉత్సవాలు పర్యవేక్షించే నాథుడే కరువయ్యాడు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఈ ఆలయానికి కమిటీ నియామకం చేయలేదు. నేతల మధ్య గ్రూపుల పోరుతో కమిటీ నియామకం కాలేదని ఆ పార్టీ నేతలే చెప్పుకొస్తున్నారు. ప్రతి ఏటా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేస్తున్నప్పటికీ వారి పెత్తనంతో సామాన్య ప్రజానీకానికి అమ్మవారి దర్శన ప్రాప్తి కూడా కలగడంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు ప్రాణాలతో చెలగాటం తగదు

ప్రజాశక్తి - కురుపాం

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును రాజమండ్రి జైలులో అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, ఉక్కపోతతో డీహైడ్రేషన్కు గురైనా, స్కిన్ ఎలర్జీతో అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ అన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాం టిడిపి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విషయంలో పోలీసు ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి, ప్రభుత్వ ఒత్తిడితోనే నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. స్కాములు, ఆధారాలు లేకుండా ఏ తప్పు చేయని చంద్రబాబు నాయుడును జైలుకు పంపి, ఆరోగ్యం బాగోలేకపోయినా ఆస్పత్రికి తరలించరా హింసించడం దారుణమని వాపోయారు. చంద్రబాబు కిలోల బరువు తగ్గినందున కిడ్నీలపై ప్రభావం చూపుతుందని తెలిసినా ఆసుపత్రికి పంపకపోవడం చాలా దారుణమని ప్రజలంతా ఇది చూస్తూ గమనిస్తున్నారని, కచ్చితంగా రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక మండల కన్వీనర్ కేవీ కొండయ్య, అరుకు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, టిడిపి యువత ఆరిక సాయి, చంటి, కరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాయం పిసరంత... ప్రచారం కొండంత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏడాదిగా ఇదిగో అదిగో అంటూ చెప్పుకొచ్చిన ప్రభుత్వం ఎట్టకేలకు ఈనెల 12న సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే సాయంపై అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఒకరినొకరు మించిపోయేలా ప్రసంగించారు. ప్రభుత్వ సాయాన్ని ఆకాశానికెత్తేశారు. ఆ మాటకొస్తే బొబ్బిలిలో గృహప్రవేశాల సందర్భంగా కొందరు లబ్ధిదారులు కూడా తమ సొంతింటి కల నెరవేరిందంటూ స్పందించారు. ఈ ప్రచారానికి మించి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న మొత్తం ఎంత? ఇసుక, సిమెంట్, ఇటుక, కూలి రేట్లు, మొత్తంగా చిన్నపాటి ఇల్లు కట్టుకోవడానికి అవుతున్న మొత్తం ఎంత? అన్నదానిపై జిల్లాలో ముమ్మరంగా చర్చసాగుతోంది. ఇల్లు కట్టి చూడు అంటారు పెద్దలు. అందుకు తగ్గట్టే గృహ నిర్మాణ సామగ్రి ధరలు ఆకాశాన్ని అంటాయి. ఇనుము టన్ను ధర రూ.60వేలు పలుకుతోంది. ఇక ఇసుక రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులకు తప్ప దొరికే పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ట్రాక్టర్ ఇసుకకు రూ.6వేలు నుంచి రూ.7వేలు వరకు వెచ్చించాల్సివస్తోంది. కూలీల రేట్లు రూ.600 నుంచి రూ.1000 వరకు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో సర్కారువారు ఇస్తున్న రూ.1,80,000 ఏమేరకు సరిపోతుందో అంటూ లబ్ధిదారుల్లో ఎక్కువ మంది వాదన. అందువల్లే ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మంజూరైన 78,127 ఇళ్లకుగాను

పబ్లిక్ టాక్

3,994 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. పునాదుల దశల్లో, నిర్మాణదశలో 18,819 ఇళ్లు ఉన్నాయి. 13,509 ఇళ్లు మాత్రమే పునాదుల దశలో నిలిచిపోయాయి. కేవలం 36,506 ఇళ్లు పూర్తయ్యాయినట్టు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఇంటి పైకప్పువేసే దశలో 3,811 ఇళ్లు, ఇంటిపైకప్పు వేసినవి 1,488 ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్నట్టుగా వారికి అందుతున్న సాయం సరిపోతే ఇన్ని ఇళ్ల నిర్మాణాలు ఎందుకు వెనుకబడ్డాయన్నది ప్రజాప్రతినిధులు, అధికారులే చెప్పాల్సివుంది. ఇంకా చెప్పాలంటే గ్రామీణ ప్రాంతాల్లోనూ, ముఖ్యంగా సొంత స్థలాల్లో నిర్మాణాల వెనుక అప్పుల విక్రయాలు, అప్పులు నిర్మించుకున్న ఇళ్లే ఎక్కువ ఉన్నాయి. తమ ఇళ్ల ఉన్నాయన్న విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో చాలా వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం, నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోవడం వంటి పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్‌గా ప్రభుత్వం భావిస్తున్న గుంకలాం లేఅవుట్‌లో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఈ లేఅవుట్‌లో సుమారు 11వేల ఇళ్ల స్థలాలకు గాను 10,154 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకోవడం, ప్రభుత్వం తరఫున ఇసుక, సిమెంట్, ఐరన్ వంటి నిర్మాణ సామగ్రిని పంపిణీ చేయడం, పూర్తిగా ప్రభుత్వమే నిర్మించి లబ్ధిదారులకు అప్పగించి ఇవ్వడం వంటి మూడు పద్ధతుల్లో ఇక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ఇప్పటి వరకు ఈ లేఅవుట్‌లో కేవలం 352 ఇళ్లు మాత్రమే పూర్తికావడం గమనార్హం. 114 ఇళ్ల నిర్మాణ పనులు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడ ఇళ్లను నిర్మించడం మొత్తం ఇళ్లలో సుమారు 8వేల వరకు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాల్సివుంది. సుమారు 3వేల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. మిగిలిన ఐదు వేల ఇళ్లు కూడా స్థలాల్లో పునాదులు మాత్రమే పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు పడకపోవడంతో సుమారు ఏడాది క్రితమే సంబంధిత కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. తాజాగా నిధుల సమస్య లేదని అధికారులు చెబుతున్నారు. పనులు కూడా ప్రారంభమైనప్పటికీ అంత మరుకుగా సాగడం లేదు. గతంలో ఇక్కడ ఇళ్ల నిర్మాణ పనులకు కాంట్రాక్టర్ వద్ద రోజూ సుమారు 500 నుంచి 600మంది పనిచేసేవారు. ప్రస్తుతం 100మందికి మించి కనిపించడం లేదు. దీంతో, పనులు అత్యంత మందకొడిగా సాగుతున్నాయి. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగిపోతున్నాయని, లబ్ధిదారులంతా సంతోషంగా ఉన్నారని చెప్పుకోవడం పట్ల జనం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

శంకుస్థాప చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని చినమరికిలో శనివారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు గ్రామస్తులతో కలిసి గ్రామానికి అవసరమయ్యే తాగునీటి సరఫరా నిమిత్తం రూ.15 లక్షల నిధులతో నిర్మించబోయే తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ఎక్కడికక్కడ తాగునీటి సరఫరా మెరుగుపర్చి ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటింటికి తాగునీటి సరఫరా పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని అందులో భాగంగా నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ కోట్లాది రూపాయలు విలువచేసే పనులను చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బి.రవికుమార్, జెడ్‌పిటిసి ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, మండల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, జిల్లా పార్టీ జనరల్ సెక్రెటరీ వి.గురురాజు, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, సర్పంచ్ హెచ్.గంగరాజు, సీనియర్ నాయకులు గవర రమేష్, రాగాల సోమశేఖర్, గవర గుంపస్వామి, బి.త్రినాథ, డి.శ్రీనివాసరావు, బి.దుర్గారావు, నాయకులు, కార్యకర్తలు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.



ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రాన్నిస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావుకు వినతి పత్రం అందించారు. మండలం నూరు శాతం గిరిజన ప్రాంతం కావడం, 1/70 చట్టం అమల్లో ఉన్నందున ఇళ్లస్థలాలు మంజూరు చేయడం కుదరదని కాబట్టి గిరిజనేతర ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతంలో విలేకరులకు కూడా ఇళ్ల స్థలాల మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా అది కార్యరూపం దాల్చలేదని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని మైదానప్రాంత మండలాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరయ్యేలా చూడాలని విన్నవించారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురం ఆదివారం ఈనెల 23 వరకు దసరా నవరాత్రి ఉత్సవాలను వర్తక సంఘం, మోటారు యూనియన్, గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు సర్పంచి బొత్తాడ గౌరీశంకర్ రావు తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'ప్రజల కోసం పనిచేస్తున్నాం'

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రజల కోసం జనసేన పనిచేస్తుందని ఆ పార్టీ క్రియాశీలక సభ్యులు వజ్రగడ రవికుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని కిమ్మీ గ్రామంలో శనివారం క్రియాశీలక సభ్యత్వం కిట్లను పంపిణీ చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 3వేలమంది కౌలు రైతులు చనిపోతే ఒక్కొక్క కుటుంబానికి లక్ష చొప్పున అధినేత పవన్‌కల్యాణ్ పంపిణీ చేశారని ఆయన అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు చేస్తున్న కూలీలు

గురుకులానికి మరమ్మతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపల్ యుగంధర్ ప్రత్యేక శ్రద్ధ వహించి మరమ్మతు పనులు చేస్తున్నారు. పాత స్నేహితుడు రూ.25000 పాఠశాల అభివృద్ధికి సహాయం చేయడంతో మంచి నీటి ట్యాప్‌లను అమర్చి తాగునీటి సౌకర్యాన్ని మెరుగుపర్చారు. అనంతరం ఇతర నిధులతో పాత గేటుకు మరమ్మతు చేసి పెయింటింగ్ వేసి ఉపయోగం తీసుకొచ్చారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రిన్సిపల్ యుగంధర్‌కు లెక్చరర్లు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తోటపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లిలో గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. ముందుగా స్వామివారికి తలనీలాలు సమర్పించి తదుపరి పవిత్ర నాగావళి నదిలో స్నానమాచరించి స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులు యావన్మందికి మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురానికి ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి దంపతులు విరాళాలతో అన్నదానం ఏర్పాటు చేశారని ఆలయ కార్యనిర్వాహణాధికారి బుద్ధ మహాలక్ష్మినగేష్ తెలిపారు. కార్యక్రమంలో పోలిరాజు, గంట శ్రీధర్ నాయుడు, ఆలయకమిటీ సభ్యులు మార్కొండ ఫకీరునాయుడు, వడ్డి మహేశ్వరరావు (మహేష్) తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

దంపతులను ఢీకొన్న ద్విచక్ర వాహనం

భర్త మృతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మృతుడు అప్పారావు

స్థానిక వైకెఎంనగర్, ఎస్పి కార్యాలయం రోడ్డు ఎదురుగా ఉన్న బాలాజీ నగర్‌కు చెందిన అప్పారావు(63) దంపతులు తమ ద్విచక్ర వాహనంపై పట్టణంలో దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా, తమ వీధి మలుపు తిప్పేలోగా సీతానగరం నుండి రేసింగ్ బైక్‌పై అతివేగంగా వచ్చిన ఇద్దరు యువకులు ఈ దంపతులను బలంగా ఢీకొట్టారు. దీంతో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి. ఇద్దరు యువకులు పరిస్థితి గ్రహించి అక్కడ నుంచి చల్లగా జారుకున్నారు. స్పందించిన స్థానికులు దంపతులను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ భర్త అప్పారావును మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలిస్తుండగా దారిలోనే మరణించాడు. భార్య లక్ష్మి పార్వతీపురం ఆసుపత్రిలోనే చికిత్స పొందుతుంది. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న యువకుల కోసం గాలిస్తున్నారు.

పశువైద్యశాలలో మందుల్లేవ్

- ప్రయివేటు షాపుల్లో కొనాల్సిందే
- రెగ్యులర్ వైద్యులూ కొరతే..

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో పశువైద్యానికి ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందుల కొరత వైద్యానికి ప్రతిబంధకంగా మారింది. పశువుల పెంపకందారులపై ఆర్థికభారం పడుతోంది. ఆస్పత్రుల్లో పశు వైద్యానికి అవసరమైన మందులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వైద్యసేవలు అరకొరగా అందుతున్నాయి. రైతులు మందులను ప్రైవేటుగా కొనుగోలు చేసుకుంటేనే పశు వైద్యులు వైద్యం చేసే పరిస్థితులున్నాయి. దీంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పశువైద్యానికి అవసరమైన మందుల కొనుగోలుకు ప్రభుత్వం అరకొరగా బడ్జెట్ విడుదల చేయడంతో ఈ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయనే విమర్శ వినిపిస్తోంది. దీంతో పశువుల ఆస్పత్రుల్లో మందులకు గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. రెండు నెలల నుండి రావాల్సిన మందులు ఇప్పటికీ రాలేదు. చాలా మందులు ప్రైవేట్ కొనుగోలు చేస్తున్నామని పాడిరైతులు తెలిపారు.

కురుపాం పశు వైద్య ఆసుపత్రికి అటెండరే దిక్కు

నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలోని పశు వైద్య ఆసుపత్రికి రెగ్యులర్ వైద్యాధికారి లేక గరుగుబిల్లి మండలం నుంచి డిప్యూటేషన్ వేసిన ఆయన అప్పుడప్పుడు వస్తుండడంతో ఆస్పత్రిలో ఉన్న అటెండరే పశువులకు వైద్యం చేస్తున్నాడు. దీంతో పశువులకు సరైన వైద్యమందడంలేదని ఈ క్రమంలో ఆస్పత్రుల్లో క్షేత్రస్థాయిలో సక్రమంగా సేవలందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రెగ్యులర్ వైద్యాధికారి నియమించాలని మందులు అందుబాటులో ఉండేలా చూడాలని పశు పోషకులు కోరుతున్నారు.

కురుపాం: పశువైద్య శాల

మందులు, వైద్యాధికారుల కొరత లేకుండా ప్రభుత్వమే చూడాలి

ఓ పక్క వ్యవసాయనికి ఎరువులు, మందుల కోసం రైతులు వేల రూపాయలు ఖర్చు పెడుతున్నప్పటికీ సరైన సమయంలో వర్షాల్లేక అనుకూలమైన వాతావరణం లేక పంట చేతికి వస్తాదో లేదో తెలియని పరిస్థితిలో అయోమయంలో ఉండగా, మరోవైపు పశువులు రోగాల బారిన పడుతుంటే ఆస్పత్రుల్లో పశువులు మందులు దొరక్క ప్రైవేట్ ఆస్పత్రుల్లో కొనుక్కోవడం వల్ల మరింత ఆర్థిక భారం రైతులపై పడుతుంది. కావున ప్రభుత్వమే స్పందించి ప్రతి పశు వైద్య ఆసుపత్రి వద్ద మందులు అన్ని అందుబాటులో ఉంచి రెగ్యులర్ వైద్యాధికారులను నియమించాలి.

కొల్లి గంగునాయుడు
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

మత్స్యకార సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- సాలూరు

రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ చెప్పారు. శనివారం ఆమె పట్టణంలోని పేరసాగరం చెరువులో 54,300 చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపల వేట వృత్తిగా జీవిస్తున్న వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. జిల్లా ఫిషరీస్ అధికారి వి.తిరుపతయ్య మాట్లాడుతూ జిల్లాలో 10.05లక్షల చేప పిల్లలను రూ.16లక్షలతో కొనుగోలు చేసి విడుదల చేసినట్లు తెలిపారు. జిల్లాలో 48 మత్స్యకార సంఘాలలో 4,600మంది సభ్యులు వున్నారని చెప్పారు. ఫిష్ ఆంధ్రా కార్యక్రమంలో

సాలూరు: చేపపిల్లలను విడిచిపెడుతున్న ఈశ్వరమ్మ

భాగంగా జిల్లాలో 68 యూనిట్లు మంజూరయినట్లు చెప్పారు. ఇప్పటికే 60 యూనిట్లు ప్రారంభమయ్యాయన్నారు. ఒక్కో యూనిట్‌కి రూ.1.75లక్షలు నుంచి రూ.3.25లక్షల వరకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు 60 శాతం సబ్సిడీ, బీసీలకు 40శాతం సబ్సిడీ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 110 చెరువుల్లో చేపపిల్లలను విడుదల చేశామన్నారు. వచ్చేనెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు బోట్లు, వలలు, ఇతర పనిముట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్‌లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, గొర్లి వెంకటరమణ, నెయ్యిల కుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు టెక్కలి ధర్మారావు పాల్గొన్నారు.

పాచిపెంట: చేప పిల్లల పెంపకంతో మత్స్యకారుల ఆదాయం పెంచుకోవచ్చునని ఎంపిపి బి.ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని పెద్దగెడ్డ జలాశయంలో శనివారం చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి బి. ప్రమీల మాట్లాడుతూ ఈ పెద్ద గెడ్డ జలాశయం ద్వారా సుమారు 200 మంది గిరిజన మత్స్యకార రైతులు చేపలను వేటాడుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అర్హుడైన ప్రతి ఒక్క మత్స్యకార రైతుకి మత్స్యకారి పింఛన్లు అందజేస్తున్నామన్నారు. సబ్సిడీ ద్వారా చేపలు పట్టుకునేందుకు వలలు కూడా అందిస్తున్నామన్నారు. చేపల వేటకు

పాచిపెంట: చేపపిల్లలను విడిచిపెడుతున్న ఎంపిపి ప్రమీల

వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తు ఎవరైనా మృతి చెందితే ఆ కుటుంబానికి వైయస్సార్ మత్స్యకార బీమా ద్వారా రూ.10లక్షల ప్రభుత్వం అందిస్తుందన్నారు. జలాశయంలో చేపలు పట్టుకుంటూ ఎవరైతే జీవనం సాగిస్తున్నారో వారందరికీ సభ్యత్వ నమోదు చేయాలని, వారందరికీ బీమా చేయించే బాధ్యత కూడా మత్స్యకార శాఖ అధికారులే తీసుకోవాలని కోరారు. ఏడి తిరుపతయ్య మాట్లాడుతూ త్వరలో మత్స్యకారులకు వలలు, బోట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొట్టాపు ముత్యాలు నాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపిపి కొరపల్లి రవీంద్రనాథ్, సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, ఎంపిటిసి దండి ఏడుకొండలు, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు జోగరాజు, పలు గ్రామాలు మత్స్యకారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- సాలూరు

ఎపి టీచర్స్ ఫెడరేషన్ సాలూరు, పాచిపెంట మండలాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని శ్రీ సత్యసాయి జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో సాలూరు, పాచిపెంట మండలాలకు చెందిన కొత్త కమిటీలను ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముక్తేశ్వర పాణిగ్రాహి, జిల్లా కార్యదర్శి ఎంవి గౌరీశంకర్, ఉపాధ్యక్షుడు నాయుడు ప్రభాకర్ పర్యవేక్షణలో నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. సాలూరు మండల కమిటీ అధ్యక్షులుగా ముత్తాడ రాజు, ప్రధాన కార్యదర్శిగా వాసిరెడ్డి పొట్టయ్య, గౌరవాధ్యక్షులుగా ఆరంగి చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు. పాచిపెంట మండల అధ్యక్షుడుగా సిహెచ్ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.తిరుపతిరావు, గౌరవాధ్యక్షులుగా ఎ.ఆనంద్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ కార్యవర్గాలను జిల్లా నాయకులు అభినందించారు.

ప్రకృతి కషాయాలు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు ఆధ్వ ర్యంలో మండలం బాలగుడ బలో శనివారం వరి పంటకు పొటా స్కు ప్రత్యామ్నా యంగా జిల్లేడు ఆకుకషా యం, దోమపోటు నివారణకు తూటికాడ కషాయం గ్రామంలో ప్రతి గడప గడపకు ప్రతి ఒక్క రైతుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనంగా ఎరువుల వాడకాన్ని తగ్గించుకుని పంట కాలానికి అవసరమయ్యే ఎరువులను సహజ సిద్ధంగా గ్రామంలో లభించే జిల్లేడు ఆకుతో పొటాష్ పోషకాన్ని అందించవచ్చుని, చీడపీడల నివారణకు తూటి ఆకుకాడ కషాయం ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. అలాగే దేశీ విత్తనాలను ప్రోత్సహించాలని ప్రతి రైతు దేశీ వాలీ విత్తనాలను వేయాలని, దేశి వాలి విత్తనాలలో అధిక పోషక విలువలు కలిగి ఉన్నాయని వివరిం చారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు శ్రీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

కషాయాలను పంపిణీ చేస్తున్న షణ్ముఖరాజు

మూఢనమ్మకాలపై విద్యార్థుల నాటిక

ప్రజాశక్తి - సాలూరు

సమాజంలో మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మండలంలోని మామిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల లో నాటిక ప్రదర్శన చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల్లో నెలకొన్న చిల్లంగి, బాణామతి, చేతబడి వంటి మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన పెరిగేలా వారితో ఒక నాటికను ప్రదర్శన చేశారు. పాఠశాల ఉపాధ్యాయుల దర్శకత్వంలో విద్యార్థులు ప్రదర్శించిన నాటిక పలువుర్ని ఆకట్టుకుంది. గ్రామపెద్దలు విద్యార్థులను అభినందించారు.

నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

టీకాల నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - బెలగాం

వ్యాధినిరోధక టీకా నిర్వహణలో నిర్దేశించిన నియమాలు ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహ నరావు సూచించారు. ఈ మేరకు ఆయన 20వ వార్డు (ఎస్ఎన్‌పి కాలనీ)లో టీకా కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. సూచించబడిన మార్గదర్శకాలను ఏ మేరకు అమలు చేస్తున్నారో పరిశీలించారు. శనివారం టీకా వేయాల్సిన పిల్లలు, గర్భిణీలు ఎంతమంది, వారి వివరాలు, గడువు తేదీలు, టీకా కేంద్రంలో ఉంచబడిన వ్యాక్సిన్ క్యారియర్‌లో ఉన్న వ్యాక్సిన్ శీతోష్ణస్థితి, అత్యవసర మందుల కిట్ (ఎఇఎఫ్ఐ కిట్), సిరంజీలు, హబ్ కట్టర్ పరిశీలించారు. టీకా వేసే ముందు పిల్లలు, గర్భిణుల ఆరోగ్య స్థితి గమనించాలన్నారు. ముందుగా నోటి ద్వారా వేయాల్సిన టీకా తర్వాత ఇంజెక్షన్ ద్వారా వేయాల్సిన టీకా వేయాలన్నారు. టీకాలు పూర్తైన తర్వాత వారిని టీకా కేంద్రంలోనే కొద్ది సమయం ఉంచి పర్యవేక్షణ చేయాలన్నారు. వేస్తున్న ప్రతి టీకా ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. వివరాలన్నీ యూవిన్, ఆర్‌సిహెచ్ పోర్టల్స్‌లో

సిబ్బందితో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు

ఆన్లైన్ నమోదు చేయాలన్నారు. పట్టణ శివార్లలో తాత్కాలిక జీవనం, వలస జీవనం గడిపే వారిని సందర్శించాలని అక్కడ టీకాలు పొందని పిల్లలు, గర్భిణీలను గుర్తిస్తే వెంటనే టీకాలు వేయాలని ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ పుష్ప, జయగౌడ్, ఎఎన్ఎం సావిత్రి, అంగన్వాడీ సిబ్బంది బి.జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

4న చలో హైదరాబాద్

ప్రజాశక్తి - వీరఘట్టం

నవంబర్ 4న చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని దళిత సంఘం నాయకులు ఎస్. రమేష్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని దళిత నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ చేపడుతున్న విశ్వరూప మహా పాదయాత్రలో మాదిగలంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ కళ్యాణ్ ప్రసాదు, యేసేపు, ఎన్వి భాస్కర్ రావు, చిన్నికృష్ణ, రాము, పవన్, గౌరమ్మ, సరోజినీ పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలో గల స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ నూతన మండల కార్యవర్గం ఎన్నిక జిల్లా పరిశీలకులు భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగింది. మండల గౌరవాధ్యక్షులుగా తీళ్ల మధుసూదన్‌రావు, అధ్యక్షులుగా పల్లె శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శిగా బొత్స ప్రసాదరావు, సహాధ్యక్షులుగా తెర్లి అప్పలనాయుడు, కూన లక్ష్మి, కోశాధికారిగా డివి రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్నిక అనంతరం ఎంఇఒను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై ప్రాతినిధ్యం చేశారు.

సీతానగరం: ఎంఇఒకు వినతి పత్రాన్నిస్తున్న యుటిఎఫ్ నాయకులు

గుమ్మలక్ష్మీపురం కార్యవర్గం ఇదే

గుమ్మలక్ష్మీపురం: యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా కొండగొర్రి భాస్కరరావు, అధ్యక్షులుగా పత్తిక శంకర్ రావు, ప్రధాన కార్యదర్శిగా పత్తిక ప్రసాదరావు ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా ఆరిక జగదీశ్వరి, కిల్లక రవి, కోశాధికారిగా డి సిహెచ్ నారాయణ, ఆడిట్ కన్వీనర్‌గా జీలకర్ర అజయ్ కుమార్ ఎన్నికయ్యారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, కార్యదర్శి బిడ్డిక కూర్మారావు, నిమ్మక శ్రీరాములు సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

శ్రమదానంతో రహదారి బాగు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పూతికవలస గిరిజన ప్రాంతంలో మరమ్మతులు గురైన రహదారులను ప్రజా ప్రతి నిధులు, ఐటిడిఎ అధికారులు పట్టించకపోవడంతో పివి ఈత మనుగూడ సర్పంచ్ పి.వీరన్న ఆధ్వర్యంలో గిరిజనులు శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. పివి ఈత మనుగూడ, గురండి, పుట్టిగాం, కోమటి గూడ, చీడిమానుగూడ గిరిజనులు శ్రమదానంలో పాల్గొన్నారు. సర్పంచ్ గిరిజనులతో మమేకమై వారు గ్రామాలకు రాకపోకలు జరిగే విధంగా పంచాయతీ పరిధిలో ఉన్న రహదారులను బాగు చేసుకుంటున్నారు.

శ్రమదానంతో రోడ్డును బాగు చేసుకుంటున్న గిరిజనులు

ఏజెన్సీలో 'మేము సైతం బాబుకు తోడుగా'

ప్రజాశక్తి - వీరఘట్టం

చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మండలంలోని గోర గిరిజన గ్రామంలో శనివారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మేము సైతం బాబుకు తోడుగా ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టుపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, ఎఎంసి మాజీ చైర్మన్ పి.కృష్ణమూర్తి నాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షులు మాచర్ల అనిల్ కుమార్, ఎ.కుమారస్వామి, మండల కార్యదర్శి చింత ఉమామహేశ్వరరావు, ఎన్.శశి కుమార్, ఎ.కృష్ణబాబు, ఆర్.రత్నాకర్‌రావు, స్వామినాయుడు, డి.రాజబాబు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పాలకొండ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా బాబుతో మేము కార్యక్రమంలో భాగంగా శనివారం ఎం.సింగుపురం, మల్లివీడు గ్రామ పంచాయతీల్లో మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు ఆధ్వర్యంలో ఇంటి ఇంటికీ కరపత్రాల పంపిణీ చేశారు. ప్రతి వ్యక్తికి చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి తెలుపడమైందని, ప్రజల్లో విశేష స్పందన వచ్చింది. చంద్రబాబుకు అన్యాయం జరిగితే ఊరుకోమని ప్రజలు గట్టిగా వ్యతిరేకం తెలుపుతున్నారు. చంద్రబాబు వెంటే మేము అంటూ ఈసారి చంద్రబాబు నాయుడును సిఎంగా గెలిపించుకుందాం అని స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో కోట సంగన్నాయుడు, కిమిడి కాశీనాయుడు, శాసపు సుగుణకరరావు, మీసాల శ్రీనివాసరావు, మంకు

టిడిపిలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

భాస్కరరావు, మంకు రాము, కీర్తి రమణారావు, మంకు పోలినాయుడు, సామారోతు అప్పలనాయుడు, వారాడ త్రినాథ్‌నాయుడు, వారాడ దుర్గారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో గిరిజన కుటుంబాలు చేరిక

మక్కువ: మండలంలోని చెప్పుబుచ్చంపేట పంచాయతీ పరిధిలోని మోసూరు వలస, గుణికొండవలస, మూకవలస గిరిజన గ్రామాల నుండి పలు కుటుంబాలు శనివారం టిడిపిలో చేరాయి. టిడిపి మండల అధ్యక్షులు జి వేణుగోపాల్, సీనియర్ నాయకులు మావుడి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి హాజరై పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాలనపై విసుగు చెందిన పలువురు టిడిపిలోకి వస్తున్నారన్నారు. అనంతరం తూరు మామిడి గ్రామంలో బాబుతో నేను కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని పిఆమిటి పంచాయతీ వంజరపుగూడ గ్రామంలో బాబుతో నేను కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుపాం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి పాల్గొని మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో టిడిపిని మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, బూత్ ఇంచార్జి రామారావు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డి సాగిస్తున్న కక్షపూరిత రాజకీయాలకు పరాకాష్ట చంద్రబాబు అరెస్ట్ అని టిడిపి అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శనివారం పార్వతీపురం మండలంలోని పెద్ద బొండపల్లి గ్రామంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనాల విజయచంద్ర ఆధ్వర్యంలో జరిగిన బాబుతో నేను అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాఆరు. ఇంటింటికి వెళ్లి తప్పుడు కేసులో చంద్రబాబు నాయుడు అరెస్టు గురించి వివరిస్తూ, ప్రజల మద్దతును కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, బోను చంద్రమౌళి, చుక్క అచ్యుతరావు, ఎంద్రాపు చినరామినాయుడు, బార్నాల సీతారాం, గొరజాన చంద్రమౌళి, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

In the Honourable Court of the Principal Junior Civil Judge at Parvatipuram.
O.S.135/2021

Between:-
Allumalle Appa Rao. ......Plaintiff.
And:-
1. Busi Chandrika,
2. Busi Nagamani. ...... Defendants.
To:

D.1. Busi Chandrika D/o late Ramana Rao C/o Chukka Uma Maheswari, aged 26 years, Door.No. 109, Street.No.510, Manikanta Colony, Pasupureddi vari Street, Kottavalasa, Parvatipuram, Parvatipuram Manyam District.

D.2. Busi Nagamani D/o late Rama Rao, aged 23 years resident of Door.No. 109, Street, 510, Manikanta Colony, Pasupureddy Street, Kothavalasa village, Parvatipuram Manyam District.

Where as the above named Plaintiff has filed a suit against both of you for the relief of Decree on the foot of the Promissory note executed by you. You are hereby summoned to appear in this Court in person, or by a Pleador to answer all such question on the **20th day of October 2023 at 10-30 A.M..** Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and Determined in your absence.

"By Order of the Court ".

Parvatipuram, Dt : 13.10.2023.
P.Manikeswara Sai
Advocate Bobbili.